కథానిక

# తొలగిపోయిన విశ్వాసం

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

ఉత్తరవాహిని ఇసుక తిన్నెలమీద కూర్చుని విశ్రాంతి తీసుకుంటూన్న మిత్ర బృందం కొరియా రణరంగం మొదలుకుని పోతురాజు ఇంటిగోడవరలదాకా విశేషాలు దొర్లుతున్నాయి.

ఇదంతా ఒక్కసారి ఆగిపోయింది. హఠాత్తుగా ఆగిపోయింది. హరి కాలుస్తూన్న సిగరెట్ని బలంగా రెండు దమ్ములులాగి దూరంగా నీళ్ళలోకి గిరవాటువేస్తూ "శేఖరం ప్రాక్టీసు ఎత్తిగట్టి స్వంత వూరు వెళ్లిపోతాట్ట" అన్నాడు కొంచెం బాధని వ్యక్తం చేస్తూ.

"పాపం!" అన్నాడు విశ్వనాథం.

"అలాగా?" అన్నాడు రమణ.

ఇదంతా వింటూన్నా గోపాలం ఏమీ మాట్లాడలేదు. ఈ మిత్ర బృంద మంతటికీ శేఖరం సన్నిహితుడు. కాని గోపాలానికి ఎక్కువ దగ్గర.

హరి చెప్పిన విశేషంలోని నిజం ఎంత అని అడుగుతూన్నట్టు తనవంక ప్రశ్నార్థకంగా చూస్తూన్న మిత్రుల భావాలని గ్రహించి గోపాలం మెల్లిగా ఇసకలోకి దోసిన చేతుల మీదకి వాల్తూ "నిజమేలెండ్రా. మధ్యాహ్నం నాడు అలాగ చెప్పాడు. వచ్చేవారం మధ్యలో వాళ్ళ వూరు వెళ్ళిపోతాడుట. ఏర్పాట్లు చేసుకుంటున్నాడు" అన్నాడు.

"అంత వేగంగానా?" అన్నాడు హరి.

"అక్కడ ఏమిటి చేస్తాడు?" అన్నాడు విశ్వం.

"ఏమీలేదు. వ్యవసాయం చేస్తూ చేతనైనంత మానవసేవ చేస్తూ గడుపుతాడట."

"బహుశా బీదలకి మందు లివ్వడమూ అదీ చేస్తాడు కాబోలు."

విశ్వం ఈ మాటలు పూర్తి చెయ్యకుండానే రమణ అందుకుని "పాపం! మరి తక్కువ కష్టం వచ్చిందా? ప్రాణంలాగ పెంచుకుంటున్న కొడుకు ఒక్కడూ పోయాడు - ఇంకేముంది పాపం అతనికి?" అన్నాడు తక్కువ గొంతుకతో ఎక్కువ విచారం వ్యక్తంచేస్తూ.

"అందులో కన్న కొడుకుని చేతులారా చంపుకున్నాక మనస్సు వికలమైపోయి ఉంటుందిరా. న్యాయమే. కాని ఎంత వేగంగా పరిస్థితులు మారుతాయి చూడండి! నాలుగు సంవత్సరాల క్రిందట ఈ నెలలోనే శేఖరం ప్రాక్టీసు పెట్టి మనందరికీ టీపార్టీ యిచ్చాడు. ఈనాడు- పాపం!- అన్నీ వొదులుకుంటున్నాడు."

"కన్నపిల్లలంటే తండ్రులకంతటి మమకారం ఉంటుందిరా" అని సర్దాడు విశ్వం వేదాంతాన్ని బలపరుస్తూ హరి. గోపాలం విషాదంగా చిన్న నవ్వు నవ్వి అందర్నీ ఉద్దేశిస్తూ అన్నాడు:

"మీరంతా అక్కడే పొరపడుతున్నారు. నేనూ అలాగే అనుకున్నాను నిజం తెల్సుకునేదాకా."

విశ్వం అందుకుని- "నువ్వు చెప్పేది కాస్త విపులంగా చెప్పరా. శేఖరం ప్రాక్టీసు మానడానికి, తన చేతులతోనే మందిచ్చుకుని కన్న కొడుకుని చంపుకోవడం కాదంటావా?" అన్నాడు సగం అనుమానంగా, సగం ఆశ్చర్యంగా.

"అలాగ అనను. కాని కేవలం అదొక్కటే శేఖరం పనికి కారణం కాదంటాను" అన్నాడు గోపాలం.

మిత్రులంతా ప్రశ్నార్థకంగా చూసి గోపాలం చెప్పబోయేది వింటున్నారు. దూరాన కొండమీదనించి వచ్చే పక్షుల రవాలు కాక అక్కడ నది శబ్దం మాత్రమే వినిపిస్తూంది.

గోపాలం బాధని చెప్ప సాగాడు.

"అంతా రెండు నెలల క్రిందటి సంగతి. శేఖరం కొడుకుని మీరందరూ ఎరుగుదురుగా.

హైస్కూల్లో థర్డ్‌ఫారం చదువుతున్నాడు. వాడూ, ఆతరగతిలో చదువుతున్న అప్పారావు అనే మరో కుర్రవాడూ చాలా స్నేహితులు.

"అప్పారావు తండ్రి చాలా పెద్దమనిషి. అందుచేత శేఖరమూ, అతను కూడా వీళ్ళ స్నేహానికి ఏమీ అడ్డుచెప్పలేదు. అప్పారావూ, సత్యం, అంటే శేఖరం కొడుకన్న మాట, కలిసి సాయంత్రం పూట ఆడుకొనేవారు. ఇష్టం వచ్చిన దగ్గరకి వెళ్ళేవారు. చెప్పానుగా దాని కెవ్వరూ అభ్యంతరం చెయ్యలేదని. ఇలాగ ఉండగా రెండు నెలల క్రిందట వాళ్ళిద్దరూ ఒక సాయంత్రం, ఎదురుగాఉంది చూశారూ ఆ కొండ, దానిమీదకి షికారు వెళ్ళేరు. తరవాత చెప్పారట లెండి. అక్కడ ఏవో కాయలుతిని కొండమీద చెరువులోనే నీళ్ళు త్రాగారట.

"సాయంత్రం ఆరుగంటలకి ఇద్దరూ కొండ దిగి ఇంటికివచ్చారు. కొంచెం బద్ధకంగా ఉంటే శేఖరం భార్య సత్యాన్ని అడిగిందట. "ఏమిరా-అలాగ ఉన్నావ"ని.

వాడేం చెప్పకపోతే మామూలే ననుకుని రాత్రి మామూలుగా అన్నంపెట్టి చదువుకో మందట. తొమ్మిదిదాకా అలాగ బద్ధకంగానే చదివి పడుకున్నాడట. ఉదయం లేచేసరికి బాగా జ్వరం వచ్చిందట.

శేఖరం చూశాడు. జ్వరలక్షణాలు కొంచెం ఆశ్చర్యకరంగానే కనబడ్డాయట.

దాన్నిగురించే ఆలోచిస్తూంటే అప్పారావు తండ్రి కబురుపెట్టాడట డాక్టరుగారికి. శేఖరం వెళ్లి చూశాడు.

ఏ జ్వరలక్షణాలు సత్యం విషయంలో కనిపించాయో సరిగ్గా అవే ఏమీ భేదంలేకుండా కనిపించాయట.

ఈ పరిస్థితికి ఆశ్చర్యపడి పైకి ఏమీ అనకుండా వాళ్లిద్దర్నీ తరిచి అడిగాడట. తొలినాడు జరిగింది చెప్పారట.

రెండువారాలు శేఖరం పిల్లలిద్దరికీ ఒకే రకపు మందు ఇస్తూ లక్షణాలు కనిపెట్టాడు. ఏమీ భేదంలేదు. అప్పుడు రామారావు డాక్టర్ గార్ని కూడా సంప్రదించి మూడవవారం ఇద్దరికీ ఒకే మందివ్వడానికి ఆయనని రప్పించి జాయింట్ గా ట్రీట్ మెంట్ సాగించాడు.

మూడవవారమూ, నాల్గవ వారమూకూడా చాలా బలమైన మందులు ఇవ్వసాగారు పిల్లలకి. కాని ఏమీ ఫలితం కనిపించలేదు సరిగదా, నాలుగోవారం మధ్యలో ఇద్దరికీ వాంతులూ, విరేచనాలూ ప్రారంభించాయి.

రామారావుగారు చాలా ఆశ్చర్యపోయారు ఈ ఇద్దరి వ్యాధుల లక్షణాల్లోనూ ఆశ్చర్య జనకంగా ప్రబలుతూన్న ఈ సమత్వానికి. కాని దీనికి కారణం ఉందిగా. అందుచేత ఒక ట్రీట్ మెంటే ఇద్దరికీ సాగించారు.

సరే, ఆరోవారం నాటికి కొంచెం వ్యాధి తగ్గిందా అనిపించింది. విరేచనాలూ, వాంతుల సంఖ్య ఇద్దరి విషయంలోనూ తగ్గింది.

ఏడోవారం మధ్య ఒకనాడు సత్యం చాలా తీవ్రంగా బుర్రఊపుతూ పేలాపన మొదలు పెట్టాడు. మధ్యాహ్నం పన్నెండుకి. మరో పావు గంటకి అప్పారావుకి కూడా అదేలక్షణం సంక్రమించిందని విని రామారావుగారి బలవంతంతో శేఖరం అప్పారావుని చూడ్డానికి వెళ్లాడు—

చెప్పాగా అప్పారావూ అలాగే ఉన్నాడని. రెండుగంటలయేసరికి అప్పారావులో కొంచెం మార్పు వచ్చింది. పేలాపన తగ్గింది. నాలుగయ్యేసరికి అప్పారావు సంపూర్ణంగా మామూలు మనిషయ్యాడు. టెంపరేచరుకూడా మామూలుగా అయిపోయింది.

సంతోషిస్తూ శేఖరం సత్యం విషయంలో కూడా అలాగే అవుతుందని, ఆశతో ఇంటికి వచ్చాడు... కాని ఏముంది? సత్యం చివరి నిముషాల్లో ఉన్నాడు.

ఆసాయంత్రం సత్యంచివరిసారిశ్వాసించాడు. తరువాత అప్పారావు స్థిరంగా ఆరోగ్యం కోలుకుంటున్నాడు. ఇదీ జరిగినది. దీంతో శేఖరానికి మందుల్లో నమ్మకంపోయింది. అతనింక మందివ్వడు-త్రాగడుకూడా... ఇంక మీ ఇష్టం వచ్చిన నిశ్చయాలకి రండి...

గోపాలం ముగించాడు. మిత్రులంతా ఆలోచనలో పడ్డారు. అనతి దూరంలో ఒక్కసారి మండుతున్న స్మశానంలోని కాష్టం చూస్తూ హెచ్చరిక పొందినట్లు అందరూ లేచారు ఇళ్లకి వెళ్లడానికి - నిశ్శబ్దంగానే.